



	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
బాపట్ల	6.22	5.04
గుంటూరు	6.22	5.04
నరసరావుపేట	6.24	5.06

రంజాన్ వేళలు

మహిళామణులు

- నిర్దేశిత లక్ష్యాలు ఎంచుకున్నారు
- వాటికనుగుణంగా ఉన్నత చదువులు
- నేటి మహిళలకు ఆదర్శం
- చదువే మహిళల ఎదుగుదలకు నాంది అంటున్న మహిళలు
- ఆడపిల్లలను చదివించాలంటున్న మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కనకదుర్గమ్మ... పార్వతి... సరస్వతి... భ్రమరాంబ వీరంతా దేవతామూర్తులు. వీరందరిని నిత్యం ఆరాధిస్తూ పూజిస్తారు. కట్టుబాట్ల పేరుతో మహిళను వంటింటికే పరిమితం చేశారు. ఆధునిక సమాజంలో కట్టుబాట్లను తెంచుకుని క్లర్క్ నుంచి పైలట్ వరకు అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారు. వంట చేసిన చేతితో కలం పట్టారు.. గరిట తిప్పిన చేతితో స్టీరింగ్ తిప్పుతున్నారు. ఆటలోను పాటలోను మేము సైతం అంటున్నారు. రాజకీయాల్లోనూ తమ సత్తా చాటుతున్నారు. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ప్రభుత్వం వారం దినాలుగా ప్రత్యేకంగా మహిళల కార్యక్రమాలు నిర్వహిస్తోంది. శనివారం రేపల్లెలో మహిళా దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఉన్న మహిళా ఉన్నత ఉద్యోగులను కొందరినైనా పలుకరిద్దాం. – సాక్షి ప్రతినిధి,బాపట్ల

నాడి పట్టిన నారి విజయమ్మ



జిల్లా వైద్యాధికారి విజయమ్మ తన కెరీర్ గురించి మాట్లాడుతూ మా తల్లిదండ్రులు వెంకటరమణ, నారాయణమ్మలు ఉన్నత చదువులు చదివించారు. పదో తరగతి వరకు కదిరి బాలికల పాఠశాలలో, ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, హైదరాబాద్‌లో పీజీ చదివారు. 1996 నుంచి మెడికల్ ఆఫీసర్‌గా, ఎస్‌పీహెచ్‌వో డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్‌గా, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్‌ఎంవోగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా వైద్యాధికారిగా ఉన్నారు. ఆడపిల్లనని చూడకుండా తల్లిదండ్రులు చదివించడం వల్లే ఈ స్థాయికి చేరాను. సరైన లక్ష్యాలు ఏర్పరుచుకొని మహిళలు చదివాలి. అప్పుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారు. మహిళల ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబనతో సమాజం అభివృద్ధి చెందుతుంది. దేశ ప్రగతిలో మహిళల పాత్ర తప్పనిసరి. అందుకే మహిళలు వెన్నుచూపక ముందుకు సాగాలి. అప్పుడే అన్ని విధాలా గౌరవం దక్కుతుంది. అందరికీ ఆమె మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పల్లె నుంచి పరిశోధన వైపు...



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ బి.కృష్ణవేణి. ఆమె పరిశోధన స్థానం హెడ్ కూడా. నేటి మహిళకు స్ఫూర్తి. ఆమె తన కెరీర్ గురించి మాట్లాడుతూ మా తండ్రి శంకరరావు, తల్లి మంగమ్మ. మాది రేపల్లె. నాన్న నేవీలో ఉద్యోగి. మేము ముగ్గురం ఆడపిల్లలం, ఒక తమ్ముడు. అప్పట్లోనే ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నది నాన్న కోరిక. అలా నేను రేపల్లెలో హైస్కూల్ చదువు, నల్లపాడు సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఇంటర్, బాపట్ల అగ్రికల్చర్ కళాశాలలో డిగ్రీతోపాటు పీజీ పూర్తిచేశాను. 1994నుంచి 2001 వరకు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(హైదరాబాద్)లో రీసెర్చ్ అసోసియేట్‌గా ఉద్యోగం, అక్కడే పీహెచ్‌డీ కూడా చేశాను. 2002 నుంచి 2007 వరకు అమృతలూరు వ్యవసాయ అధికారి, 2007లో ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీలో జాయినింగ్. ఇప్పటివరకూ బాపట్ల పరిశోధన స్థానంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్, అండ్ హెడ్. ఇక పెద్ద చెల్లి దుర్గారాణి ఉపాధ్యాయురాలు, ఇంకొక చెల్లి నాగమణి బాపట్ల డిగ్రీకళాశాల ప్రిన్సిపల్, తమ్ముడు శివప్రసాద్ ఉపాధ్యాయుడు. అప్పట్లోనే తమ తల్లిదండ్రులు చదివించడం వల్లే అందరం ఈ స్థాయిలో ఉన్నాం. ప్రతి తల్లి, తండ్రి ఆడపిల్లలను చదివించాలి. పిల్లలు పట్టుబట్టి చదవాలి, లక్ష్యాలు నిర్దేశించుకోవాలి, వాటిని సాధించాలి. మహిళలు ఉన్నతస్థాయిలో ఉంటే సమాజం సరైన దారిలో నడుస్తుంది.

తండ్రి కలలు నిజం చేస్తూ...



బాపట్ల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గ్లోరియ తన కెరీర్ గురించి మాట్లాడుతూ మాది ప్రకాశం జిల్లా సంతనూతలపాటు మండలం మైనంపాడు. నాన్న పలతోటి జాన్, అమ్మ కమల. ఇద్దరూ ప్రధానోపాధ్యాయులే. ముగ్గురం ఆడపిల్లలం. నాన్నకు మమ్మల్ని ఉన్నత స్థాయిలో చూడాలన్న కోరిక. అందుకే చదివించారు. స్థానికంగా 1984 నాటికి ఒంగోలు హెచ్‌సీఎమ్ కళాశాలలో పదో తరగతి, నల్లపాడు సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో ఇంటర్, జెఎంజె తెనాలి, ఒంగోలు మంగమ్మ కళాశాలల్లో డిగ్రీ, ఎంఏ ఎకనమిక్స్ ఆంధ్ర యూనివర్సిటీలో పూర్తిచేశాను. 1995లో గ్రూప్-2లో సెలెక్ట్. డిప్యూటీ తహసీల్దారుగా ఉమ్మడి రాష్ట్రంలోని కరీంనగర్, తర్వాత వెలుగొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఒంగోలు, స్టెప్ సీఈవో, అండ్ డీపీవో(ఎఫ్ఏసీ)గుంటూరు, డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లయ్, సీఆర్‌డీఏ, అమరావతి-అనంతపురం హైవే భూసేకరణ అధికారి, చిత్తూరు జెడ్పీ సీఈవో, ప్రస్తుతం బాపట్ల ఆర్డీవోగా చేస్తున్నాను. తల్లిదండ్రులు ఆడపిల్లలు అనుకోకుండా చదివించడం వల్లే ఈ స్థాయిలో ఉన్నాం. కళలన్నా, పుస్తక పఠనమన్నా, తెలుగుభాష అన్నా తనకు ఎనలేని ఇష్టమన్నారు. ప్రతి మహిళ చదుకోవాలి. ఇప్పటి యూత్ సోషల్ మీడి యా, ఇతర వ్యాపకాలతో సమయం వృథా చేస్తున్నారు. చదువు, ఉద్యోగం, లేదా వ్యాపారం ఏ రంగమైనా ఫర్వాలేదు అభివృద్ధి సాధించడమే లక్ష్యం కావాలి.

నేడు రేపల్లెలో మహిళా దినోత్సవం

బాపట్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని రేపల్లెలో శనివారం ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రేపల్లె ఎంపీఏ హాల్‌లో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా 500 స్వయం సహాయక సంఘాలకు రూ.100 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మెప్మా ఆధ్వర్యంలో రూ.13.68 కోట్ల బ్యాంకు లింకేజి రుణాలను మహిళలకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ ద్వారా పీ.ఎం.ఈ.జీ.పి పథకం క్రింద 50 మంది లబ్ధిదారులకు రూ.5 కోట్ల మేర రుణాల మంజూరు ఉత్తర్వులు అందజేయడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. రేపల్లె మున్సిపాలిటీలో మహిళలకు కుట్టు సెంటర్‌ను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సభా ప్రాంగణం వద్ద సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసే స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రంగాలలో సేవలు అందించిన మహిళలకు ప్రతిభా పురస్కారాలను అందజేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, అదనపు ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగిరెడ్డి, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేడుకలలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొలుసు పార్థసారధి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్‌తోపాటు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

న్యూస్‌రీల్

పోలీసులకు లొంగిపోయిన వెల్ఫేర్ కార్యదర్శి

దాచేపల్లి: దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలో వార్డు సచివాలయం -3లో వెల్ఫేర్ కార్యదర్శి సంపత్ లక్ష్మీప్రసాద్ శుక్రవారం పోలీసులకు లొంగిపోయినట్లు తెలిసింది. ఈనెల 1న రూ.8.23 లక్షల పింఛను నగదును తీసుకుని పరారైన విషయం విదితమే. దీనిపై నగర పంచాయతీ కార్యదర్శి ఎం.వి.అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లక్ష్మీప్రసాద్ పోలీసులకు లొంగిపోయి తాను చేసిన తప్పు అంగీకరించినట్లు సమాచారం. పూర్తిస్థాయిలో వివరాలు తెలియాల్సి ఉంది. పింఛనుదారులకు ఇవ్వాల్సిన నగదు ఎత్తుకెళ్లిన లక్ష్మీప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు నగరపంచాయతీ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించారు.

మహిళల భాగస్వామ్యం తప్పనిసరి



తెనాలిరూరల్: అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని సబ్‌కలెక్టర్ సంజనా సింహా అన్నారు. తెనాలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సభకు ఎంపీడీవో అత్తోట దీప్తి అధ్యక్షత వహించారు. సబ్ కలెక్టర్ సంజనా సింహా ముఖ్యఅతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వెలుగు ఏపీఎం జయశ్రీ వందన సమర్పణ చేశారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. తెనాలి డీఎల్‌డీఓ శ్రీదేవి, పంచాయతీ రాజ్ ఏఈ పార్వతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, సీడీపీఓ సునీత పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను సబ్ కలెక్టర్ సందర్శించారు.

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న ఆర్డీ కార్యాలయంలో తెలియజేయాలని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 44 కాంట్రాక్టు స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు గత ఏడాది డిసెంబరు 30న నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. నోటిఫికేషన్‌లో 44 కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలు ఉన్నాయని, 5,888 మంది ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

స్వచ్ఛాంధ్ర పోస్టర్ల ఆవిష్కరణ



గుంటూరురూరల్: స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్‌కలెక్టర్ భార్గవ్ తేజ, నగర కమిషనర్ శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనాసింహా, డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, డీపీఓ సాయికుమార్, రూరల్ మండలం ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, విస్తరణ అధికారి కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమశాఖ అధికారి కె మయూరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మోటుపల్లి ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తీసుకురావాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: మోటుపల్లి ప్రాచీన ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. మోటుపల్లి గ్రామం, మ్యూజియం నిర్మాణం, వీరభద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం నిర్వహించారు. కాకతీయులనాటి అభయ శాసనాలను తెలుగులోకి అనువదిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇప్పటికే పురావస్తు శాఖ పరిశోధకులు, శాసనాల పరిశోధకుల ద్వారా ఆ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ప్రాచీన వైభవం తెచ్చేలా కోదండరామ ఆలయం అభివృద్ధి చేస్తామన్నారు. కోదండరామ దేవాలయానికి సమీపంలోని 5.8 ఎకరాల భూమిని ఆలయానికి కేటాయించాలన్నారు. ఆ భూమికి సంబంధించిన దస్త్రాలు, వివరాలను సీసీఎల్ఏకు నివేదించాలన్నారు. చినగంజాం మండలంలోని ఆ గ్రామంలో తుపాను షెల్టర్ ఎదురుగా ఉన్న 4.5 ఎకరాల ఖాళీ భూమిని విచారించాలన్నారు. సమీపంలోని 10.9 ఎకరాల భూమిని కోదండ రామ స్వామి దేవాలయానికి కేటాయించే అంశంపై దృష్టి సారించాలన్నారు. 100 ఎకరాల పరిధిలోని బయోడైవర్సిటీ భూమిని పరిశీలించాలన్నారు. కాకతీయులు, చోళరాజుల నాటి శాసనాలు, పంచలోహాలను చిన్నగంజాంలోనే భద్రపరచడానికి మ్యూజియం నిర్మించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. మ్యూజియం నిర్మాణంపై పురావస్తు శాఖకు సమగ్ర నివేదికతోపాటు లేఖ పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రాచీన సంపద ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై, విజయవాడ మ్యూజియంలలో ఉందన్నారు. వాటిని తెప్పించడానికి దస్త్రాలను సిద్ధం చేయాలన్నారు. ప్రాచీన కాలం నాటి బుద్ధుడి విగ్రహాన్ని భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. డీఆర్వో జి గంగాధర్‌గౌడ్, చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సూర్యప్రకాశరావు, శాసనాల పరిశోధకులు డాక్టర్ బి రమేష్‌చంద్రబాబు, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సంస్థ అధ్యక్షులు డాక్టర్ సాయిబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

గురుకుల పాఠశాలలో మౌలిక వసతి కల్పించాలి

డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. నర్సాయపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధిపై అనుబంధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన స్థానిక కలెక్టర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన రూ.3.5 లక్షలతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. 24 మరుగుదొడ్లు నిర్మించేలా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు దస్త్రం పంపాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పాఠశాలకు వంటగది, విద్యార్థుల కొరకు భోజనశాల ఏర్పాటు చేయాలన్నారు. క్రీడా మైదానాన్ని చదును చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారం తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, పంచాయతీ రాజ్ ఇన్‌చార్జి ఎస్ఈ గొడిపేరి రతన్ బాబు, పాఠశాల ప్రధానాచార్యులు పాల్గొన్నారు.

జనరిక్ మెడికల్ షాపుపై ప్రజల్లో అపోహలు వద్దు

జనరిక్ మెడికల్ షాపులపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీచర్స్ కాలనీలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధ పరియోజన మందుల షాపును కలెక్టర్ ప్రారంభించారు. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ ఉన్నారు.

పక్కా గృహాల నిర్మాణంలో లక్ష్యాలు చేరుకోవాలి

పక్కా గృహాల నిర్మాణంలో ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. గృహ నిర్మాణాలపై సంబంధిత శాఖ అధికారులతో శుక్రవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. మొదటి త్రైమాసికంలో బాపట్ల జిల్లాకు 4,898 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యం అన్నారు. ప్రస్తుతం 454 మాత్రమే పూర్తి చేయడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. లక్ష్యాలను పూర్తిచేయని ఇంజినీర్లకు చార్జి మెమోలు తయారుచేయాలని ఆదేశించారు. మిగిలినవన్ని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఈఈలు, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రుణం ప్రాణం తీసింది

అప్పుల బాధతో కూలీ ఆత్మ హత్య

అద్దంకి రూరల్: అప్పుల బాధతో మనోధైర్యాన్ని కోల్పోయి ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఓ కూలీ చనిపోయాడు. ఈ సంఘటన శుక్రవారం అద్దంకి మండలంలో చోటుచేసుకుంది. ఈమేరకు మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు. తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన ధనరాజుపల్లి కోటేశ్వరరావు (37) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది కిందట ప్రైవేటు ఫైనాన్స్‌లో ఇంటిపై రుణం తీసుకున్నాడు. ఆ అప్పు కట్టలేక పోతున్నానని భార్యతో చెప్పుకొని తీవ్ర మనోవేదన పడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా వేలాడుతున్నాడు. కొన ఊపిరితో ఉన్న కోటేశ్వరరావును అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలలో ఉంచారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

ఏఎన్‌యూ బీఈడీ ప్రశ్నపత్రం లీక్

- పరీక్షకు అరగంటకు ముందే లీకైన మొదటి సెమిస్టర్ ప్రశ్నపత్రం
- పరీక్షల నిర్వహణలో ఏఎన్‌యూ అధికారులు నిర్లక్ష్యం

పెదకాకాని : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష పత్రం లీకైన ఘటన కలకలం రేపింది. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రాస్పెక్టివ్స్ ఇన్ చైల్డ్ డెవలప్మెంట్ పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే ప్రశ్నపత్రం లీక్ అయినట్లు తెలుస్తోంది. సీడీ ద్వారా ఆన్‌లైన్‌లో అరగంట ముందుగా ప్రశ్నపత్రాన్ని రిలీజ్ చేశామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కానీ మొబైల్ ద్వారా అరగంట ముందే లీకై బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. పరీక్షల నిర్వహణకు సబంధించిన కొందరు అధికారులు పరీక్ష కేంద్రాల నిర్వాహకుల వ్యవహార శైలిపై ఉదాసీనంగా ఉండడమే లీకేజీకి కారణంగా తెలుస్తోంది. దీంతోపాటు కొత్తగా పరీక్షకు అరగంట ముందుగా సీడీ ద్వారా విడుదల చేసే విధానం కూడా ప్రశ్నపత్రం సులభంగా లీక్ కావడానికి కారణమని పలువురు పేర్కొంటున్నారు. శుక్రవారం పరీక్ష పేపర్ లీక్ అయిందని ఘటన వెలుగులోకి వచ్చినప్పటికీ గురువారం కూడా ప్రశ్నపత్రం అరగంట ముందుగానే లీక్ అయిందన్న విమర్శలు ఉన్నాయి. సంబంధిత అధికారులకు తెలిసినా బయటకు రానియకుండా చూడటం వల్లే పరిస్థితులు శ్రుతి మించుతున్నాయనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. బీఈడీ పరీక్షలకు సబంధించిన పరీక్ష కేంద్రాల ఖరారు, పరీక్షలను పర్యవేక్షించే అధికారుల నియామకం వంటి కీలక అంశాలు కొన్ని పరీక్షా కేంద్రాల నిర్వాహకుల కనుసన్నల్లో జరుగుతుండటం ఇలాంటి ఘటనలకు కారణమవుతోందనే విమర్శలూ వస్తున్నాయి. ఏఎన్‌యూ బీఈడీ ప్రశ్నపత్రం లీకేజీపై ఉన్నత విద్యాశాఖామంత్రి లోకేష్ విచారణకు ఆదేశించారు.

ప్రపంచ శాంతి కోసమే గుడారాల పండుగ

- ఫాస్టర్ అబ్రహం
- తరలివచ్చిన విశ్వాసులు

అమరావతి: ప్రభువైన ఏసుక్రీస్తుచే తేజరింపచేసి ప్రపంచంలోని మానవులందరి ఉజ్జీవం కోసం గుడారాల పండుగలో ప్రార్థనలు చేస్తున్నామని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు, దైవజనులు ఫాస్టర్ అబ్రహం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హోసన్నా దయాక్షేత్రంలో హోసన్నా మినిస్ట్రీస్ నిర్వహించే 48వ గుడారాల పండుగ రెండవ రోజు రాత్రిపూట ప్రార్థనలకు వచ్చిన లక్షలాది మంది ఆరాధికులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ ఈ పండుగలో విశ్వాసులు, సేవకులు ఉజ్జీవింపబడాలంటే దేవుని చేత ప్రకాశించి, వాక్యం మీద ఆసక్తి కలిగి దేవుని ప్రార్థనే ఊపిరిగా భావించాలన్నారు. దేవున్ని స్తుతించకుండా, ఆరాధించకుండా ఉండలేనసే స్థితికి మనం చేరుకోవాలన్నారు. తాను కూడా అనేకులను ప్రభువు చెంతకు చేర్చటానికి సారధిగా మారాలనే సంకల్పం ఉండాలన్నారు. దేవుని యందు విశ్వాసంతో మనం పనిచేయగలిగితే జనులు కూడా నిన్ను అనుసరిస్తారు, అందుకు దైవజనులు ఏసన్న జీవితమే సాక్ష్యమన్నారు. 48 సంవత్సరాల కిందట కేవలం 80 మందితో నిర్వహించిన గుడారాల పండుగకు అదే గ్రామంలో నేడు లక్షలాదిమంది తరలిరావడం మనం ప్రత్యక్షంగా చూస్తున్నామన్నారు. వసతులు ఉన్నా, లేకపోయినా, అవకాశం ఉన్నా లేకపోయినా లక్షలాది మంది ఈ దయా క్షేత్రానికి రావడానికి కారణమైన ఏసుప్రభు చూపిన మార్గంలో మనందరి నడిపిన దైవజనులు ఏసన్న కారణజన్ముడన్నారు. దేవుని కృప నీపై ప్రసరించబడిన ఈరోజు నుంచి ప్రతి ఒక్కని జీవితంలో సర్వసమృద్ధి కలుగుతుందన్నారు. దేవుడు తనని నమ్మినవారందరిని ఒకరి వద్ద చేతుల చాచే స్థితిలో లేకుండా అదృష్టాన్ని ప్రసాదించబోతున్నారన్నారు. దేవుని అనుగ్రహం పొందినవారిని తృణీకరించిన వారందరూ సాగిలపడతారన్నారు. అనంతరం రెండవ వర్తమానంలో హోసన్నా మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ ప్రసంగించారు. తొలుత దేవుని స్తుతి గీతాలకు సండేస్కూల్ చిన్నారుల నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. సుపీరియర్ సిస్టర్ ప్రేమ ఆధ్వర్యంలో దేవుని గీతాలాపనలు విశ్వాసులను భక్తిభావంలో ఓలలాడించాయి. ఈ ప్రార్థనలలో దేశం నలుమూలల నుంచి వచ్చిన లక్షలాదిమంది హోసన్నా ఆరాధికులు పాల్గొన్నారు.



ఆరాధికులనుద్దేశించి ప్రసంగిస్తున్న దైవజనులు ఫాస్టర్ అబ్రహం



ప్రార్థనలలో పాల్గొన్న లక్షలాదిమంది ఆరాధికులు

క్లుప్తంగా

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమిలో శుక్రవారం శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభించినట్లు ఈవో ఈమని అశోక్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలను 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం తెల్లవారుజామున ధ్వజారోహణ, రాత్రి 9.30 గంటలకు విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 12న స్వామి కల్యాణం, 13న అన్నసమారాధన ఉంటుందని ఆయన తెలిపారు. భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి



మార్టూరు: కుక్కలు దాడి చేసి గొర్రెలను చంపిన సంఘటన మండలంలోని ద్రోణాదులలో గురువారం అర్ధరాత్రి జరిగింది. బాధితుడు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక బీసీ కాలనీకి చెందిన రాగినీడి గంగయ్య గొర్రెలను కోలలపూడి రోడ్డులోని తడికెల షెడ్డులో ఉంచి నిద్రపోయాడు. అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో కొన్ని కుక్కలు షెడ్డులో దూరి విచక్షణారహితంగా గొర్రెలపై దాడి చేశాయి. గంగయ్య మేల్కొని కుక్కలను తరిమివేసే లోపే 12 గొర్రెలను చంపేశాయి. వాటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఏడు నెలల కిందట ఇదే షెడ్డులో ఐదు గొర్రెలను కుక్కలు దాడి చేసి చంపినట్లు గంగయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

కారు ఢీ.. వ్యవసాయ కూలీ మృతి



బల్లికురవ: పొలం పనులు ముగించుకుని రోడ్డు దాటుతున్న వ్యవసాయ కూలీని వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం కొప్పరపాడు, వినుకొండ ఆర్ అండ్ బీ రోడ్డులోని ఆర్‌కే వైన్స్ సమీపంలో జరిగింది. మండలంలోని గొర్రెపాడు గ్రామానికి చెందిన జంధ్రాజుపల్లి పున్నబాబు (44) పొలం పనులు ముగించుకుని రోడ్డు పైకి వచ్చాడు. ఈ సమయంలో వినుకొండ నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టంతో బలమైన గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బల్లికురవ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చట్టసభల్లో సగం వాటాతోనే మహిళల అభ్యున్నతి

కలెక్టర్ జె.వెంకట మురళి



మహిళల టగ్ ఆఫ్ వార్‌ను చూస్తున్న కలెక్టర్

బాపట్ల: చట్టసభలలో 50 శాతం మహిళలు వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో వేడుకలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. లెమన్ అండ్ స్పూన్, గోనె సంచులతో పరుగు పందెం, టగ్ ఆఫ్ వార్, స్పీడ్ వాక్, మ్యూజికల్ చైర్స్ వంటి పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను కలెక్టర్ సందర్శించారు. ఉత్సాహంగా పాల్గొన్న ఉద్యోగినులను ఆయన అభినందించారు. అనంతరం మహిళా అధికారులు ఆర్డీఓ పి. గ్లోరియా, జిల్లా ఖజానా శాఖ అధికారి కామేశ్వరి, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె. సుభాషిణి, సీడీపీఓ లక్ష్మీపార్వతిలను ఆయన ఏపీ జేఏసీ నాయకులతో కలసి ఘనంగా సన్మానించారు. పోటీలలో పాల్గొన్న ఉద్యోగులందరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు. అనంతరం మాట్లాడుతూ మహిళలపై లింగ వివక్ష లేకుండా ప్రతి కుటుంబంలో చిన్నారులను నైతిక విలువలతో పెంచాలని చెప్పారు. అప్పుడే సమాజంలో అత్యాచారాలు జరగకుండా నివారించగలమని తెలిపారు. ఇంటి నుంచే లింగ వివక్షతను ఆరికట్టాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉన్నాయని జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ చెప్పారు. మహిళలను చిన్నచూపు చూడరాదని చెప్పారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విజేతలకు ప్రభుత్వం నిర్వహించే మహిళా దినోత్సవం వేడుకలలో బహుమతులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాస్, డీఎస్‌డీఓ కె. పాల్ కుమార్, ఏపీ జేఏసీ చైర్మన్ సురేష్, మహిళ విభాగం చైర్ పర్సన్ రజిని పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితోనే దేశ అభ్యున్నతి

- సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు
- చట్టాలపై మహిళలకు అవగాహన తప్పనిసరి
- బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: మహిళాభివృద్ధితోనే దేశ అభ్యున్నతి సాధ్యమని సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలు ప్రస్తుతం అంతరిక్షాన్ని చుట్టి వచ్చేంత ఎత్తు ఎదిగారని తెలిపారు. అన్ని రంగాలలో పురుషులతో పోటీ పడుతూ తమదైన శైలిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఎంతో ఉన్నతస్థితిలో ఉన్నా మహిళలు సమాజంలో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, వీటిని జయించాలంటే తప్పనిసరిగా చట్టాలపై అవగాహన ఉండాలని ఆయన సూచించారు. మైనార్టీ తీరే వరకు వివాహాలు చేయరాదని తల్లిదండ్రులకు సూచించారు. మహిళలను ఇంట్లో గానీ, ఉద్యోగం చేసేచోట గానీ మానసికంగా, లైంగికంగా ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధిత మహిళలు న్యాయస్థానాల్లో నిర్భయంగా సహాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు అవసరమైన పోస్కో, గృహ హింస, బాల్య వివాహాల నిరోధం, వరకట్న నిషేధ చట్టాలతో పాటు పలు మహిళా సంరక్ష చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.సుచిత్ర, న్యాయవాదులు కొండపల్లి శ్రీనివాసరావు, డీఎస్ హరికుమార్, మోషే, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బబ్బేపల్లి కొండపై మంటలు ఆర్పివేత

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్



మంటలను అదుపులోకి తీసుకు వస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

మార్టూరు: మండలంలోని బబ్బేపల్లి గ్రామ కొండపై గురువారం రాత్రి ఎగిసిన మంటలు సహజంగా ఏర్పడినవేనని కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. ఆయన శుక్రవారం మధ్యాహ్నం సిబ్బందితో కొండపైకి వెళ్లి పరిశీలించారు. గతంలో గ్రావెల్ తవ్వకాలు జరిపిన గుంతల్లో ఎండిన చెట్ల కొమ్మలతోపాటు కొండ పరిసరాల్లో భూమి సాగు చేస్తున్న కొంతమంది రైతుల పొలాల్లో వ్యర్థాలు గాలికి కొట్టుకు వచ్చి పేరుకుపోయాయని తెలిపారు. ఎవరో విసిరిన బీడీ లేదా సిగరెట్ వల్ల మంటలు ఏర్పడి కొండపై కొంతమేర వ్యాపించాయని వివరించారు. కొండపై చెట్లకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని చెప్పారు. అక్కడక్కడా కొద్దిపాటి పొగలతో వ్యాపిస్తున్న మంటలను సిబ్బందితో కలసి ఆర్పి వేసినట్లు తెలిపారు. ఫారెస్ట్ భూమిలో సాగు చేస్తున్న రైతులు పంటకాలం పూర్తయ్యాక వ్యర్థాలను వారే తొలగించాలని, భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి ఏర్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఆధ్యాత్మికతకు నెలవు జుమ్మా మసీదు

- 160 ఏళ్ల చరిత్ర కలిగిన భట్టిప్రోలు జుమ్మా మసీదు
- ఉమ్మడి జిల్లాలో గుంటూరు తర్వాత ఒక్క భట్టిప్రోలులోనే మసీదు



భట్టిప్రోలులోని జుమ్మా మసీదు

భట్టిప్రోలు: స్థానిక గర్డర్ బ్రిడ్జి రహదారిలోని జుమ్మా మసీదుకు ఎంతో ఘన చరిత్ర ఉంది. 160 సంవత్సరాల కిందట జమాలుద్దీన్ నిర్మించారు. ఆ కాలంలో ఉమ్మడి జిల్లాలో గుంటూరు తర్వాత ఒక్క భట్టిప్రోలులోనే మసీదు ఉండేది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముస్లింలు నమాజు చేసుకునేందుకు ఇక్కడకు గుర్రాలపై తరలి వచ్చేవారని పెద్దలు చెబుతున్నారు. నమాజుకు వచ్చిన వారికి భోజన వసతి కూడా ఏర్పాటు చేసేవారని తెలిపారు. మసీదుకు ఎదురుగా ఉన్న గదుల్లో ప్రార్థన చేసేందుకు వచ్చేవారు ఒకప్పుడు విశ్రాంతి తీసుకునేవారు. గుర్రాలు నిలిపేందుకు ఈ భవనం కింద దారి ఉండేది. ఇప్పుడు అక్కడ దుకాణాలు వెలిశాయి. ఈ మసీదు ఏర్పడ్డాకే ఆయా జిల్లాలోని అన్ని ప్రాంతాలలో నెలకొల్పారు. నాటి నుంచి క్రమం తప్పకుండా ఐదు పూటలా నమాజులు, ప్రత్యేక ప్రార్థనలు జరుగుతూ వస్తున్నాయి. రంజాన్ మాసంలో ఉపవాసాలతో పాటు తరాబీ నమాజులు జరుగుతాయి.

ప్రత్యేకతను సంతరించుకుంటున్న ఈద్గాలు

ముస్లింలు ప్రత్యేక నమాజులు చేసుకునేందుకు ఈద్గాల ప్రదేశం ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి. కఠోర ఉపవాస దీక్షలను నిర్వహిస్తున్న ముస్లింలు ప్రతి నిత్యం మసీదులకు చేరుకుని, పూర్తి సమయాన్ని ప్రార్థనలతో గడుపుతూ ఆధ్యాత్మిక లోకంలో గడుపుతారు. ప్రతి ఏడాది పండుగ రోజున ప్రత్యేక నమాజు చేసే సందర్భంగా ముస్లింలు ఎంతో వ్యయాన్ని వెచ్చించి ఈద్గా ప్రాంతాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దుతారు. రంజాన్ మాసాన్ని ముస్లింలు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. మండలంలోని అద్దేపల్లి, భట్టిప్రోలు, పల్లెకోన, వేమవరం, వెల్లటూరులోనూ మసీదులు ఉన్నాయి.

అపరాల రైతులు పేర్లు నమోదు తప్పనిసరి

జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ కరుణశ్రీ



నడింపల్లిలో పెసర పంట నమూనాలను పరిశీలిస్తున్న కరుణశ్రీ

చెరుకుపల్లి: అపరాలు అమ్ముకునే రైతులు ముందుగా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని బాపట్ల జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ కె. కరుణశ్రీ సూచించారు. ఆమె శుక్రవారం మండల వ్యవసాయాధికారులతో కలసి ఆరుంబాక, గూడవల్లి, నడింపల్లి గ్రామాల్లో పర్యటించారు. పెసర పంట దిగుబడులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో బాపట్ల జిల్లాలో 58,790 హెక్టార్లలో రైతులు అపరాల సాగు చేశారని వెల్లడించారు. ఇందులో శనగలు 15,657 హెక్టార్లు, మినుములు 21,109 హెక్టార్లు, పెసలు 7,405 హెక్టార్లలో సాగు చేసినట్లు వివరించారు. శనగలను క్వింటా రూ. 5,650, మినుములు రూ. 7,400, పెసలు రూ. 8,682 చొప్పున రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని ఆమె తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్ బాబు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

1,22,426 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,11,958 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,22,426 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 44,470 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

బ్యాంక్ ఉద్యోగుల నిరసన



కొరిటిపాడు(గుంటూరు): బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చింది. ఈమేరుక ఉద్యోగులు, అధికారులు శుక్రవారం చంద్రమౌళి నగర్‌లోని కెనరా బ్యాంక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్యాంక్ ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక(యుఎఫ్‌బీయూ) జిల్లా కన్వీనర్ బాషా మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ ఉద్యోగ సంఘ నేత పరేంద్ర మాట్లాడుతూ ఐడీబీఐ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు



మహిళా అధికారులతో రెడ్‌క్రాస్ సభ్యులు

కర్లపాలెం: నేడు మహిళలు బహుముఖ ప్రజ్ఞాశాలులై అన్ని రంగాలలో రాణిస్తున్నారని రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం మండల అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ కార్యాలయంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ సుందరమ్మ, ఎంఈవో విజయశ్రీ , మండల పరిషత్ సూపరింటెండెంట్ రజని, జూనియర్ అసిస్టెంట్ కల్యాణిలను రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలు మహారాణులని, ఊయలలు ఊపిన చేతులతో ప్రపంచాన్ని పాలించగలరని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మండల ఉపాధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్ పాల్గొన్నారు.

మహిళలు ధైర్యంగా మెలగాలి

జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం)



ఓపెన్ హౌస్‌లో తుపాకీ పనితీరుపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): అన్ని వేళల్లో మహిళలు ధైర్యంగా ఉండాలని జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం) అన్నారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం పోలీస్ కవాతు మైదానంలో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. జిల్లా ఏఎస్పీ సుప్రజ మాట్లాడుతూ మహిళలు తమ లక్ష్యాలను ఛేదించాలని అన్నారు. తద్వారా నలుగురికి ఆదర్శంగా నిలవాలని చెప్పారు. స్త్రీలు లేనిదే జననం లేదని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినీలకు ఆయుధాల పనితీరుపై మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ సుబ్బారావు, సిబ్బంది అవగాహన కల్పించారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని శ్రీజలగం రామా రావు మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మహిళా సాధికారత ర్యాలీ, పాతగుంటూరు పీఎస్ పరిధిలోని యాదవ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఎస్ఐలు రమేష్ (కొత్తపేట పీఎస్), వెంకటేశ్వర్లు (పాతగుంటూరు పీఎస్) పాల్గొన్నారు.

మహిళా ఫిర్యాదుల విండోకు విశేష స్పందన

57 ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



నగరంపాలెం: మహిళా దినోత్సవం సందర్భంగా చేపట్టిన మహిళా ఫిర్యాదుల విండోకు విశేష స్పందన లభించిందని ట్రైనీ ఐపీఎస్ అధికారిణి దీక్ష చెప్పారు.ఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్లలో మహిళా ఫిర్యాదుల విండో కార్యక్రమాన్ని నిర్వహించారు. చి మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది ఫిర్యాదులు స్వీకరించారు. కొన్ని ఫిర్యాదులను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 64 మంది మహిళలు ఫిర్యాదులివ్వగా, అందులో 57 సమస్యలను తక్షణం పరిష్కరించినట్టు అధికారులు చెప్పారు. ఈ సదర్భంగా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి దీక్ష మాట్లాడుతూ ప్రత్యేక ఫిర్యాదుల విండో మంచి కార్యక్రమమని పేర్కొన్నారు.

దివ్యాంగుల బదిలీల్లో వెసులుబాటు కల్పించండి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో దివ్యాంగ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్లయ్య కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈ మేరకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులను ప్రాధాన్య క్రమంలో చేర్చి బదిలీలు నిర్వహించాలన్నారు. 70 శాతం పైబడి ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపునివ్వాలని ఒకవేళ వారు కోరుకుంటే మొదటి ప్రాధాన్యత వారికే ఇవ్వాలని కోరారు. 2025లో రూపొందించిన ఉపాధ్యాయ బదిలీ చట్టంలోని దివ్యాంగులకు ఇబ్బందికరంగా ఉన్న అంశాలను తొలగించాలన్నారు.

మనస్తాపంతో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



పెదకూరపాడు: చదువుకోవటం నాకు ఇష్టం లేదు... నన్ను బలవంతం పెట్టకండి.. నేను హాస్టల్‌కి వెళ్లను. ఇంటివద్ద ఉంటాను... అంటూ విద్యార్థి చెప్పడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని పంట పొలంలోని పురుగులు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని జలాలపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. జలాలపురం గ్రామానికి చెందిన మన్నవ శరీలు, చిట్టిమ్మల కుమార్తె మన్నవ జోష్ రాణి (17) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సెలవులకు స్వగ్రామం జలాలపురం వచ్చింది. సెలవులు అనంతరం కళాశాలకు వెళ్లకపోవటంతో తల్లి మందలించింది. చదువు ఇష్టం లేదని జోష్ రాణి చెప్పటంతో కళాశాలకు వెళ్లక పోతే నాతో పాటు వ్యవసాయ పనులకు రావాలని ఒత్తిడి చేయటంతో రెండు రోజులపాటు తల్లితో కలిసి మిరప కోత పనులకు వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం మిర్చి కోతలు కోస్తున్న పంట పొలంలో రైతు దాచుకున్న పురుగులు మందును తాగింది. వాంతులు రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను సత్తెనపల్లి ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఇన్విజిలేటర్‌కు దేహశుద్ధి

- ఎంబీఏ చదువుతున్న వ్యక్తికి ఇన్విజిలేటర్ బాధ్యతలు
- సంజాయిషీ కోరిన ఆర్‌ఐఓ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు రాస్తున్న ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఇన్విజిలేటర్‌కు తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. ప్రకాశం జిల్లా దర్శి మండలానికి చెందిన విద్యార్థిని గుంటూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల హాస్టల్లో ఉండి చదువుతోంది. ఈనెల 3 నుంచి పొన్నూరు రోడ్డులోని ఓ ప్రైవేటు కళాశాల పరీక్షా కేంద్రంలో సీనియర్ ఇంటర్ పరీక్షలకు హాజరవుతోంది. విద్యార్థిని పరీక్ష రాస్తున్న గది ఇన్విజిలేటర్‌గా వ్యవహరిస్తున్న యువకుడు పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడం, ఫోన్ నంబర్ ఇవ్వాలంటూ అడగడం చేశాడు. దీంతో మనస్థాపం చెందిన విద్యార్థిని తాను చదువుతున్న కళాశాల యాజమాన్యం దృష్టికి విషయాన్ని తీసుకెళ్లింది. కళాశాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ యువకుడిని రెండు రోజుల క్రితం పోలీసులు తీవ్రంగా మందలించారు. అదే రోజు అతన్ని ఇన్విజిలేషన్ విధుల నుంచి అధికారులు తొలగించారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి యువకుడిని కళాశాలకు పిలిపించారు. అతడికి దేహశుద్ధి చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంతో ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ చదువుతున్న వ్యక్తిని అధికారులు ఇన్విజిలేటర్‌గా నియమించడం గమనార్హం. ఈ విషయం ఆర్‌ఐవో జీకే జుబేర్ దృష్టికి వెళ్లడంతో ఎంబీఏ విద్యార్థిని ఇన్విజిలేటర్‌గా నియమించడంపై చీఫ్ సూపరిండెంట్‌ను సంజాయిషీ కోరారు.

వీఐటీలో విటోపియా క్రీడా సాంస్కృతిక ఉత్సవం ప్రారంభం



ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

తాడికొండ: విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. వీఐటీ–ఏపీ విశ్వవిద్యాలయంలో విటోపియా–2025 వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా తాడికొండ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసికాభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు.వీఐటీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, వీఐటి–ఏపి విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ కోటా రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. మూడేళ్లుగా అవుట్ లుక్ ర్యాకింగ్స్‌లో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు కేటగిరిలో దేశంలోనే ప్రథమస్థానంలో వీఐటీ ఉందని వెల్లడించారు. సాయంత్రం జరిగిన ప్రా–షోలో సెహరి బ్యాండ్, స్వరాగ్ బ్యాండ్, డీజే పరోమాల సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డాక్టర్ కృష్ణ సామి (విటోపియా కన్వీనర్), డాక్టర్ ఖాదీర్ పాషా (స్టూడెంట్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్) పాల్గొన్నారు.